## క్లుప్తంగా

### బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

**అల్లిపురం:** బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కొత్తగా నిర్మించిన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి విశేష హారతులు అందజేశారు. ఏడు శనివారాల వ్రతం చేసుకునే వారు ఆలయంలో ఏడు పిండి దీపాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

### బీచ్ కబడ్డీ పోటీల విజేత చంద్రంపాలెం



బీచ్ కబడ్డీ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న వారియర్స్ జట్టు సభ్యులు

**విశాఖ స్పోర్ట్స్:** సాగరతీరంలో శనివారం జరిగిన బీచ్ కబడ్డీ పోటీల్లో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. గోపాలపట్నం ఎస్వీఎల్ఎన్‌జెడ్ హైస్కూల్ జట్లు రన్నరప్ సాధించాయి. విజేతలకు ప్రో కబడ్డీ లీగ్‌లో ఆడుతున్న బెంగాల్ వారియర్స్ జట్టు సభ్యులు ట్రోఫీలు అందజేశారు. ఆ జట్టు కెప్టెన్ దేవంక్ దలాల్, చీఫ్ కోచ్ నవీన్ కుమార్ ఆటను ఎలా మెరుగుపరుచుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. పోర్టు స్టేడియంలో ఆదివారం జరిగే తమ మ్యాచ్ వీక్షించేందుకు ఆహ్వానం పలికారు.

### అన్నార్తుల ఆకలి తీర్చడంలో ఎంతో తృప్తి



అన్న ప్రసాదం వడ్డిస్తున్న వాసుపల్లి

**డాబాగార్డెన్స్:** సోల్జర్‌పేట యూత్ బాయ్స్ నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని స్వామికి పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే అన్నసమారాధనలో అన్నార్తులు కడుపు నింపుకుంటున్నారని, కనిపించని ఎన్నో ఆంతర్యాలు మన పండగల్లో దాగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గురజాపు రవి, అసోసియేషన్ అధ్యక్షుడు బుడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, చోడిపిల్లి నూకరాజు, సీహెచ్ ధనరాజు, లండా నూకరాజు, సీహెచ్ సతీష్, లోకేష్, అమరదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత శిక్షణ.. ఉద్యోగావకాశాలు

**డాబాగార్డెన్స్:** హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మేడ్ స్కిల్స్ సంయుక్తంగా గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ప్రొడక్షన్ ఎక్విప్‌మెంట్ ఆపరేటర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్(నర్సింగ్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరేందుకు ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, టెన్త్ పూర్తి చేసి, 18 నుంచి 28 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులన్నారు. ఉచిత శిక్షణ అందించి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు నేరుగా తమ సంస్థను లేదా 93816 67986, 72079 53919 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# శుద్ధ జలం.. పచ్చి మోసం



33వ వార్డులో ఒక వాటర్ ప్లాంట్ వద్ద ఆటోలో లోడ్ చేస్తున్న వాటర్ క్యాన్లు



ఆటోలో వాటర్ క్యాన్లు నింపుతున్న దృశ్యం

- ఆర్‌వో వాటర్ పేరిట జోరుగా తాగునీటి వ్యాపారం
- వార్డుల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న బల్క్ వాటర్ ప్లాంట్లు
- బోర్డులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా ప్లాంట్ల నిర్వహణ
- కానరాని నాణ్యత.. స్వచ్ఛత

**అల్లిపురం:** నియోజకవర్గంలో ఆర్‌వో వాటర్ పేరిట తాగునీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా జీవీఎంసీ 32, 33, 34 వార్డులతో పాటు నియోజకవర్గంలో వార్డుకు రెండు, మూడు బల్క్ ఆర్‌వో వాటర్ ప్లాంట్లు కనిపిస్తున్నాయి. మున్సిపల్ వాటర్‌ను, బోరు నీటిని ఆర్‌వో ద్వారా ఫిల్టర్ చేసి క్యాన్‌లలో విక్రయిస్తున్నారు. 20 లీటర్ల వాటర్ రూ.30 నుంచి రూ. 40 వరకు విక్రయిస్తున్నారు. కంపెనీ వాటర్ క్యాన్‌ల ధర ఎక్కువగా ఉండటంతో తక్కువ ధరకు లభించే ఆర్‌వో వాటర్ కొనుగోలుపై జనం మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా పుట్టగొడుగుల్లా ఆర్‌వో ప్లాంట్లు పుట్టుకొస్తున్నాయి. ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతులు, తాగే నీటిలో పాటించాల్సిన ప్రమాణాలు ఉన్నాయా లేదా, శుద్ధ జలమే విక్రయిస్తున్నారా అనేది ఎవరూ పట్టించుకోవడం లేదు. తక్కువ ధరకు వస్తుంది కదా అని జనం కొనేస్తున్నారు. దీంతో ఆర్‌వో నీటి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతూ కాసులు కురిపిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత జీవీఎంసీ ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి ఆర్‌వో ప్లాంట్లను తనిఖీ చేయాలని, వాటి అనుమతులు, నాణ్యతను ధ్రువీకరించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.

**నిబంధనలు పాటిస్తున్నారా?**

వాస్తవంగా ఎవరైనా ఆర్‌వో ప్లాంటు ఏర్పాటు చేయాలంటే ముందుగా ఆ ప్రాంతంలో స్థల పరిశీలన జరగాలి. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు ఏ స్థాయిలో ఉన్నాయి, నీటిలో సున్నం, మినరల్స్ ఏ స్థాయిలో ఉన్నాయి అనే విషయాలు ఫుడ్‌సేఫ్టీ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. నగర పరిధిలో జీవీఎంసీ అనుమతి తప్పనిసరి. లైసెన్స్ పొంది ప్లాంట్ ఏర్పాటు చేసుకోవలసి ఉంటుంది. నాణ్యతా ప్రమాణాలను ధ్రువీకరించే ఐఎస్ఐ మార్కు తప్పనిసరి. కానీ వార్డుల్లోని వీధుల్లో చిన్న చిన్న గదుల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను ఇష్టానుసారంగా వాడుకుంటూ వ్యాపారం చేస్తున్నారు. వాటర్ ప్లాంట్‌కు ఐఎస్ఐ మార్కు రావాలంటే నీటి పరీక్షలు చేసిన నివేదికలు ప్రభుత్వానికి అందజేయాలి. దీనికి ఖర్చు కూడా అధికమే అవుతుంది. నాణ్యతా ప్రమాణాల్లో ఏ మాత్రం రాజీ పడినా ఐఎస్ఐ ధ్రువీకరణ తిరస్కరించబడుతుంది. చాలా మంది వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఎలాంటి నిబంధనలు పాటించకుండా కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయకుండా నీటిని క్యాన్లలో విక్రయిస్తున్నారు.

**శుద్ధి చేసిన నీటి నాణ్యతా ప్రమాణాలు..**

ఆర్‌వో ద్వారా శుద్ధి చేసిన తాగు నీరు తప్పనిసరిగా ఐఎస్ 10500:2012 తాగునీటి లక్షణాలకు అనుగుణంగా ఉండాలి. పీహెచ్ 6.5 నుంచి 8.5, టీడీఎస్ కాఠిన్యం నిబధనల మేరకు ఉండాలి. ఫ్లోరైడ్ 1.0 ఏజీ/లీటర్, నైట్రేట్ 45 ఎంజీ/లీ, ఆర్సెనిక్ 0.01 ఎంజీ/లీ, సూక్ష్మజీవులు నిల్‌గా ఉండాలి. ఇన్ని అనుమతులు, నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సి ఉండగా, ఏయే అనుమతులతో ఆర్‌వో ప్లాంట్లు నిర్వహిస్తున్నారో తెలియడం లేదు. చిన్న ఇరుకు గదిలో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేసి క్యాన్‌లలో నీరు నింపి విక్రయిస్తున్నారు. అనుమతులు, నాణ్యతకు సంబంధించిన ధ్రువపత్రాలు ఎక్కడా ప్లాంట్‌లో ప్రదర్శించడం లేదు. కనీసం సంబంధిత అధికారులు సైతం ఆర్‌వో ప్లాంట్లకు అనుమతులు ఉన్నాయా లేదా, శుద్ధత, స్వచ్ఛత ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అని తనిఖీలు చేస్తున్న దాఖలాలు లేవు. దీంతో ఆర్‌వో నీటి వ్యాపారానికి అడ్డు లేకుండా పోతోంది.

**కమర్షియల్ ప్లాంట్ల కోసం..**

కమర్షియల్‌గా ఆర్‌వో ప్లాంట్ ద్వారా నీటి విక్రయాలు చేపట్టడానికి ఎంఎస్ఎంఈ కింద వ్యాపార సంస్థ నమోదు అవ్వాలి. అలాగే నాణ్యతా ప్రమాణాల కింద బీఐఎస్ ఐఎస్ఐ ధ్రువీకరణ, ఆహార గ్రేడ్ భద్రత సమ్మతిని నిర్ధారించడానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ తప్పకుండా అవసరం. స్థానిక మున్సిపల్ అథారిటీ నుంచి వాణిజ్య లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ బోర్డు నుంచి ఎన్‌వోసీ, పర్యావరణ రక్షణ నియమాలు పాటించాలి. పరిశుభ్రత, నీటి నాణ్యత ల్యాబ్ పరీక్షలు, పెస్ట్ కంట్రోల్, వర్కర్స్ హెల్త్ సర్టిఫికెట్లు, ఎలక్ట్రికల్ లోడ్ మంజూరు వంటి పలు అంశాలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

**తప్పనిసరి పరిస్థితుల్లో కొనాల్సి వస్తోంది**

బ్రాండెడ్ మంచినీటి క్యాన్లు కొనలేక, తప్పనిసరి పరిస్థితుల్లో లోకల్ మినరల్ వాటర్ కొనాల్సి వస్తోంది. 20 లీటర్ల క్యాను రూ.30 నుంచి రూ.40కి దొరుకుతుంది. అవసరమైనప్పుడు దొరుకుతాయి. అవి నాణ్యమైనవా? కాదా? అనేది మనం నిర్ధారించలేం కదా.

– ఎస్.నాగేశ్వరరావు, బంగారుమెట్ట

**నాణ్యత కోసం ఆలోచిస్తే ఎలా కుదురుతుంది?**

మంచినీరు అంటే మున్సిపల్ నీళ్లుగా భావిస్తాం. నీటిలో నాణ్యత ఎక్కడ చూడగలం? తాగేందుకు నీళ్లు కావాలి. దానినే వ్యాపారులు అవకాశంగా తీసుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొనుక్కోవాల్సి వస్తుంది. ఇప్పుడు అందరికీ అదే అలవాటైపోయింది.

– ఆర్.నాగరత్నం, వెంకటేశ్వరమెట్ట

**జీవీఎంసీ తనిఖీలు చేపట్టాలి..**

ప్రజల అవసరాలను వ్యాపారులు అనుకూలంగా మార్చుకుంటుంటారు. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన బాధ్యత జీవీఎంసీపై ఉంది. వారు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలి.

– ఎంవీఎస్ నారాయణ, అచ్చియ్యమ్మపేట

### సభతో రోడ్లు నిర్మానుష్యం



నిర్మానుష్యంగా మారిన స్టేడియం రోడ్డు

**అల్లిపురం:** జనసేన సభ సందర్భంగా మున్సిపల్ స్టేడియం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు స్టేడియంకు కిలోమీటర్ దూరం నుంచే బారికేడ్లు పెట్టి ట్రాఫిక్ పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. దీంతో స్టేడియానికి వెళ్లే రహదారులు అన్ని శనివారం ఉదయం నుంచి నిర్మానుష్యంగా మారాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, రామకృష్ణా రైతు మార్కెట్‌కు వెళ్లే వారు నడుచుకుంటూ గమ్యస్థానాలకు చేరువాల్సి వచ్చింది. జనసేన ట్యాగులు ఉన్నవారిని మాత్రమే అనుమతించడంతో సాధారణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం సభకు ఉదయం నుంచే ఆంక్షలు ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

### కూటమి ప్రభుత్వ మోసాలపై ఇంటింటి ప్రచారం



నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో ప్రచారం చేస్తున్న మాదబత్తుల రమేష్ తదితరులు

**అల్లిపురం:** జీవీఎంసీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో 75వ బూత్‌లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు పచ్చిరపల్లి రాము, ఆడారి వెంకట మహేష్, చంద్రకళ, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, కనిగిరి సంతోష్‌కుమార్, సత్య, కృష్ణారెడ్డి, ధర్మారావు, గజ్జల బాలనారాయణరెడ్డి, జీవీ మహేష్, సతీష్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ కుమార్తెను డాక్టర్ చదివిస్తా

- రామబాణం కాలేజీలో రూ.80 వేల ఫీజుతో ఉచిత సీటు
- తండ్రి క్యాన్సర్ మందులకు రూ.10 వేల సాయం
- దాతృత్వం చాటుకున్న వాసుపల్లి



రూ.10 వేల ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

**డాబాగార్డెన్స్:** మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఓ ఆటో డ్రైవర్ కుటుంబం పాలిట ఆపద్బాంధవుడిగా నిలిచారు. మధ్యలోనే ఆపేసిన పిల్లల చదువుకు భరోసా కల్పించారు. బైపీసీ చదువుతున్న ఆటో డ్రైవర్ కుమార్తెను డాక్టర్ చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతే కాక మధ్యలో ఆపేసిన ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు రూ.80 వేల ఉచిత ఫీజుతో రామబాణం కళాశాలలో సీటు కల్పించారు. వివరాల్లోకి వెళ్తే.. దక్షిణ నియోజకవర్గ పరిధి 31వ వార్డు డాబాగార్డెన్స్‌కు చెందిన ఆటోడ్రైవర్ పి.సూరి అప్పారావు 31వ వార్డులో స్థానికంగా కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అతను కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న వాసుపల్లి సూరి అప్పారావు ఇంటికి వెళ్లి పరామర్శించారు. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న అప్పారావు ఆటో వేయకపోవడం వల్ల అతని కుటుంబ పరిస్థితి చూసిన చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్ కుటుంబం పడుతున్న కష్టాలు పగవాడికి కూడా రాకూడదన్నారు. ఇంటర్‌తో చదువు ఆపేసిన సూరి అప్పారావు కుమార్తెకు రామబాణం కళాశాలలో ఉచిత ఇంటర్ సీటు ఇస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం కుటుంబ పోషణకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, పెంటకోట రాజు, రాము మాస్టారు, కాండ్రేగుల నాయుడు, బాబూరావు, మోహన్, తణుకులు, దినేష్, అనసూయమ్మ, వర, 42వ వార్డు అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రోగుల సేవలో నర్సుల పాత్ర కీలకం



కామేశ్వరి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

**మహారాణిపేట:** రోగులకు నర్సులందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏపీ గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు టి. గంగాభవానీ అన్నారు. శనివారం ఈఎన్‌టీ ఆస్పత్రి ఆవరణలో నర్సింగ్ సూపరింటెండెంట్ పి.కామేశ్వరి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా నర్సింగ్ వృత్తిలో సేవలందించిన కామేశ్వరికి ధన్యవాదాలు తెలిపారు. ఈఎన్‌టీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ రోగులకు సేవలందించడంలో వైద్యుల తర్వాత నర్సులదే కీలక పాత్ర అన్నారు. ఈ సందర్భంగా కామేశ్వరి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీధర్ (ప్రొఫెసర్), డాక్టర్ అన్నపూర్ణరావు (ప్రొఫెసర్), డాక్టర్ రామచంద్రారావ్ (అసోసియేట్ ప్రొఫెసర్), డాక్టర్ ప్రభావతి (ఆర్ఎంవో), ఆషా రామన్ (ఏవో), ఏపీ గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, సభ్యులు గౌరీ, మెహర్ శాంతి, వినీల, పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్లు లక్ష్మి, పద్మావతి, సుగీత, మరియమ్మ, యూజీ విజయ్ తదితరుల పాల్గొన్నారు.

## వినాయకా.. అదరహో



తల్లి పార్వతి చేయి పట్టుకుని బడికి వెళ్తున్న గణపయ్య



మంచుకొండల్లో శివయ్య వస్త్రధారణలో గణనాథుడు

**అల్లిపురం:** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా వీధి వీధిన మండపాలు ఏర్పాటు చేసి గణపతిని నెలకొల్పారు. అల్లిపురం కుమ్మరివీధిలో ఏర్పాటు చేసిన విఘ్ననాథులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. స్కూలు విద్యార్థిగా తల్లి పార్వతితో కలిసి పాఠశాలకు వెళ్తున్నట్లు ఏర్పాటు చేసిన ప్రతిమ, మంచు కొండల్లో శివయ్య రూపంలో గణనాథుడు విశేషంగా ఆకట్టుకుంటూ పూజలందుకుంటున్నాడు.

**గణేశుడికి దీపారాధన**

**డాబాగార్డెన్స్:** వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా 35వ వార్డు కల్లుపాకల్లో స్థానిక మహిళలు, పిల్లలు ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద శనివారం దీపారాధన నిర్వహించారు. కల్లు ఉప్పుతో వినాయకుడిని రూపొందించి దీపారాధన చేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.



వినాయకుడి సన్నిధిలో దీపారాధన

## సత్యనారాయణ సేవలు ఆదర్శనీయం



సెట్విస్ సీఈవో సత్యనారాయణను సత్కరిస్తున్న డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు తదితరులు

**మహారాణిపేట:** విధి నిర్వహణలో సిబ్బందికి సెట్విస్ సీఈవో సత్యనారాయణ ఆదర్శమని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సత్య పద్మ అన్నారు. శనివారం మహారాణిపేట ఏరియాలో ఉన్న సెట్విస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సీఈవో పదవీ విరమణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యనారాయణ 34 సంవత్సరాల సుదీర్ఘ సేవలో ఎల్లప్పుడూ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ఎస్. లక్ష్మణ్, శ్రీకాకుళం సీఈవో అప్పలనాయుడు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, మాజీ సెట్విస్ సీఈవో పి. నాగేశ్వరరావు, బీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ సుధాకర్, సెట్విస్ కార్యాలయ సిబ్బంది, సమాచార శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు సత్యనారాయణ సేవలను కొనియాడి ఆయనను సత్కరించారు.

## ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



మిస్ ఫ్రెషర్ అవార్డు గ్రహీతతో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, అధ్యాపకులు

**కంచరపాలెం:** జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 68వ స్టూడెంట్ కౌన్సిల్ ప్రారంభోత్సవ వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ మేరకు కొత్త విద్యా సంవత్సరంలో చేరిన ఇంటర్, డిగ్రీ ఫస్టియర్ విద్యార్థులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలు జరిపారు. ముఖ్య అతిథిగా గీతం డీమ్డ్ టు బి యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్, ఫిజిక్స్, ప్రొఫెసర్ డాక్టర్ పి.సరిత పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో స్వయం నిర్ణయాత్మక శక్తి పెరిగినప్పుడే సాధికారత పొందినట్లని పేర్కొన్నారు. సైబర్ క్రైమ్, గృహ హింస చట్టం గురించి అవగాహన కల్పించారు. విలువల ఆధారిత విద్య, ఆత్మ విశ్వాసం, ఆత్మగౌరవం అవసరాన్ని వివరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. మిస్ ఫ్రెషర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. డిగ్రీ విభాగంలో అమృత ఖ్యాతి, ప్రగ్య రాణి, ఇంటర్ విభాగంలో జమీలా ఖతూన్, అనుష్క విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ సుజాత, సోనీ, మౌసమి, సిస్టర్ దిపాలి, ప్రత్యూష, డాక్టర్ కోటేశ్వర్, డాక్టర్ ప్రవీణ్, ఊర్మిల, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, కౌన్సిల్ సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.



అతిథులతో అధ్యాపకులు, విద్యార్థినులు

### తాగునీరు అందించాలని ఆందోళన



స్థానికులతో కలిసి నిరసన తెలుపుతున్న దోలా జగదీష్

**డాబాగార్డెన్స్:** నియోజకవర్గం పరిధి 35వ వార్డు పండావీధి ప్రజలు మురుగు నీరు తాగుతూ విషజ్వరాల బారిన పడుతున్నారంటూ ఆ వార్డు నాయకుడు, సంఘ సేవకుడు డోలా జగదీష్ ఆవేదన వ్యక్తం చేస్తూ శనివారం వార్డు పరిధిలో స్థానికులతో కలిసి నిరసన చేపట్టారు. ఏ పాటి వర్షం కురిసినా వార్డులోని పండావీధి, వెలంపేట, ఓల్డ్ బస్టాండ్ ఏరియా, ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం తదితర ప్రాంతాల ప్రజలు మురుగు నీరు, భూగర్భ డ్రైనేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. గత కొన్ని దశాబ్దాలుగా ఈ సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ ఏ రాజకీయ నాయకుడు, ప్రజాప్రతినిధి పరిష్కారానికి ముందుకు రావడం లేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందంటూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫొటోలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. తక్షణమే స్పందించి వర్షపు నీరు, భూగర్భ డ్రైనేజీ మరమ్మతులు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నిరసనలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

### బాధితులకు బాసటగా న్యాయ సేవాధికార సంస్థ



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

**మహారాణిపేట:** లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం, ఆర్థిక సాయం, న్యాయ సహాయం, పునరావాస చర్యల కోసం పనిచేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ పలు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.రామారావు, డ్వాక్రా సంఘాల సమన్వయ అధికారి కె.వి.రామలక్ష్మి, ఈవో బి.సురేష్‌కుమార్, జిల్లా టీబీ నివారణాధికారి డాక్టర్ ఆర్.రమేష్, ఎస్సీ, ఎస్టీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.